సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 17 । జూలై । 2024



ఉద్యాన కోర్సులకు క్రేజ్
పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన వర్సిటీ ఏర్పాటుతో ఉద్యాన కోర్సులకు యువతలో క్రేజ్ పెరిగింది. ఈ ఏడాది ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రారంభించారు. 8లో ▸



తమ్మిలేరుకు భారీగా వరద
ఎగువ ప్రాంతమైన తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఏలూరు జిల్లాలో వర్షాలకు తమ్మిలేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. 8లో ▸



అంత్యక్రియల్లో అపశ్రుతి
పాలకోడేరు మండలం కొండేపూడిలో శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకెళ్తుండగా పడవ మునిగి పలువురు కాలువలో పడిపోయారు. క్షేమంగా బయటపడ్డారు. 8లో ▸

గోదాములతో గిట్టుబాటు ధర

- వరి, ఆక్వా ఉత్పత్తుల నిల్వకు ఉపయోగపడేలా నిర్మాణం
- జగన్ ప్రభుత్వంలో జిల్లాలో 24 గోడౌన్ల నిర్మాణం
- అందుబాటులోకి 6 గోడౌన్లు, 7 చోట్ల 90 శాతం పనులు పూర్తి
- ఈ ప్రభుత్వం మిగిలిన గోదాముల నిర్మాణం పూర్తి చేస్తుందా?



మొగల్తూరు మండలం శేరేపాలెంలో నిర్మాణం పూర్తయిన గోదాము



తాడేపల్లిగూడెం మెట్ట ఉప్పరగూడెంలో అందుబాటులోకి వచ్చిన గొడౌన్

భీమవరం(ప్రకాశం చౌక్): రైతులు తమ పంటను నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా.. ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకునేలా గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు మూడు విడతల్లో 129 గోడౌన్లు మంజూరు చేయగా ఫేజ్–1లో 24కు గాను 23 నిర్మాణాలు చేపట్టారు. శరవేగంగా వాటి నిర్మాణాలు కొనసాగాయి. 500 టన్నుల సామర్థ్యంతో అన్ని రకాల సౌకర్యాలతో గోడౌన్ నిర్మించేందుకు రూ.44 లక్షలు కేటాయించారు. 24 గోడౌన్లకు రూ.10.56 కోట్లు ఖర్చు చేశారు. వీటిలో 6 పూర్తికాగా మిగిలినవి 60 నుంచి 90 శాతం పూర్తయ్యాయి. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో వీటిని పూర్తి చేసి తమకు అందుబాటులోకి తెస్తుందా? లేదా? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కోణంలో ఆలోచించకుండా రైతుకు ఎంతో ప్రయోజనకరమైన వీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆక్వా రైతుల కోసం..

ఆక్వా రైతులకు ఉపయోగపడేలా గోడౌన్స్ నిర్మాణం ఉండేలా చర్యలు తీసుకున్నారు. అందు కోసం ప్రత్యేకంగా జిల్లాలో భీమవరం, కాళ్ల, శేరేపాలెం, మత్స్యపురి, కేశవరం, పిప్పర, మహదేవపటనం, ఏలూరుపాడు, శృంగవృక్షం, మోగల్లు, మల్లవరం, చేమకూరి పాలెం, రామన్న పాలెంలో మల్టీపర్పస్ గోదాములు రొయ్యలు, చేపలు, సాగుచేసే రైతులకు ఉపయోగపడేలా నిర్మించారు. ఆక్వా రైతులు తమ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకోవచ్చు. బయట ఆక్వా ఫ్యాక్టరీల్లో నిల్వ చేయడానికి చాలా ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం నిర్మించే గోడౌన్లలో అతి తక్కువ ఖర్చుకు నిల్వ చేసుకునే సదుపాయం ఉంటుంది. వరి రైతుల కోసం తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఆచంట, పోడూరు, పెనుగొండ, తదితర మండలాల్లో వీటిని నిర్మిస్తున్నారు. ఇవి వరి, కూరగాయ పంటలకు ఎక్కువగా ఉపయోగపడతాయి.

బాబు హయాంలో సున్నా

గత చంద్రబాబు పాలనలో రైతుల కోసం ఒక్క గోడౌన్ నిర్మించలేదు. దీంతో పంటల నిల్వ కోసం రైతులు ఎంతో ఇబ్బందిపడ్డారు. వ్యవసాయం, ఆక్వా సాగు అంటే దండగ అనే భావన రైతుల్లో కలిగేలా చంద్రబాబు ప్రభుత్వం రైతులకు సహకరించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం గోడౌన్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తుందా? లేదా? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లతో గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన వీటిని అందుబాటులోకి తీసుకువస్తే అటు ఆక్వా రైతులకు ఇటు వరి, కూరగాయ రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయంలో రాజకీయాలు ఆలోచించకుండా వేగంగా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోడౌన్లు ఇవీ..

గ్రామం	మండలం	ప్రస్తుత స్థితి
రావిపాడు	పెంటపాడు	అందుబాటులోకి
మెట్ట ఉప్పరగూడెం	తాడేపల్లిగూడెం	అందుబాటులోకి
కొమరవరం	తణుకు	అందుబాటులోకి
శేరేపాలెం	మొగల్తూరు	అందుబాటులోకి
రామన్నపాలెం	మొగల్తూరు	అందుబాటులోకి
మల్లవరం	నర్సాపురం	అందుబాటులోకి
ఆజ్జమూరు	ఆకివీడు	90 శాతం పూర్తి
పెనుమంచిలి	ఆచంట	90 శాతం పూర్తి
ఆచంట	ఆచంట	90 శాతం పూర్తి
మోగల్లు	పాలకోడేరు	90 శాతం పూర్తి
పండితవిల్లూరు	పోడూరు	90 శాతం పూర్తి
పోడూరు	పోడూరు	90 శాతం పూర్తి
చినమల్లం	పెనుగొండ	90 శాతం పూర్తి
కాళ్ల	కాళ్ల	60 శాతం పూర్తి
చేమకూరిపాలెం	నరసాపురం	60 శాతం పూర్తి
శృంగవృక్షం	పాలకోడేరు	60 శాతం పూర్తి
తుందుర్రు	భీమవరం	--------
ఏలూరుపాడు	కాళ్ల	60 శాతం పూర్తి
మహాదేవపట్నం	ఉండి	40 శాతం పూర్తి
మత్స్యపురి	వీరవాసరం	40 శాతం పూర్తి
కేశవరం	గణపవరం	40 శాతం పూర్తి
పిప్పర	గణపవరం	40 శాతం పూర్తి
అలంపురం	పెంటపాడు	30 శాతం పూర్తి

శ్రీవారి శయనం.. మహా పర్వదినం

నేడు తొలి ఏకాదశి పండుగ



శయన మహావిష్ణువు అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల: హైందవ సంప్రదాయంలో తొలి ఏకాదశికి విశిష్ట స్థానం ఉంది. హిందువుల తొలి పండుగ ఈ తొలి ఏకాదశి. ప్రతి ఏటా తొలి ఏకాదశినాడు విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవ ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ద్వారకాతిరుమల చినవెంకన్నను వేలాది మంది భక్తులు దర్శించనున్నారు. రాత్రి స్వామివారి తిరువీధి సేవను క్షేత్ర పురవీధుల్లో వైభవంగా నిర్వహిస్తారు. ఆషాడ శుక్లపక్ష ఏకాదశి రోజున విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి శయనించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. ఇరవై నాలుగు ఏకాదశుల్లో, ఆషాడ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. పూర్వకాలంలో దీనిని సంవత్సర ఆరంభంగా భావించేవారట. ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రతి ఒక్కరూ తొలి ఏకాదశిని పండుగలా జరుపుకుంటారు. తరువాత వరుసగా వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలు వస్తాయి. ఈ రోజు ఉపవాస దీక్ష చేసి, రాత్రంతా జాగారం ఉండాలని పండితులు చెబుతారు. మరుసటిరోజు ఉదయం శ్రీహరిని పూజించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆ తర్వాత ఉపవాస దీక్ష విరమిస్తే జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

న్యూస్‌రీల్

ఎస్పీకి వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఎస్పీకి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): బదిలీల్లో భాగంగా విశాఖపట్నం వెళ్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి కలెక్టర్ జ్ఞాపిక అందజేశారు.

గంజాయి, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి




గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు: విద్యార్థులు గంజాయి, ర్యాగింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నూజివీడు డీఎస్పీ జీ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో దెందులూరు ఎస్ఐ కే.స్వామి ఆధ్వర్యంలో యూజీడీ, బీపీఈడీ వ్యాయామ విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను పూజిస్తూ, గౌరవిస్తూ ఉత్తమ విద్యార్థులుగా ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఎదుట వ్యక్తులను బాధపెట్టాలన్న ఆలోచనే ఎదుగుదలకు పెద్ద స్పీడ్‌బ్రేకర్ అన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, మోత్కూరి శోభన్‌బాబు తదితరులు మాట్లాడారు. పెదవేగి సీఐ కే.శ్రీనివాస కుమార్, ఎస్ఐ కే.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

ఏలూరు(మెట్రో): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు జూలై 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్.సందీప్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయువు రిక్రూట్‌మెంట్ వివరాలు తెలిపారు. రిక్రూట్‌మెంట్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి అన్ని కళాశాలల్లో 17.5 నుంచి 21 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసరుకు సూచించారు. అక్టోబరు 18 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు ఉంటాయమన్నారు.

నైపుణ్యాభివృద్ధి పాత్ర కీలకం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో యూత్ స్కిల్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: యువతలో సృజనాత్మకత, సామర్థ్యాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని కాలిఫోర్నియాలోని ఓ సంస్థలో ఆర్‌అండ్‌డీ విభాగంలో పనిచేస్తున్న రాధిక అన్నారు. ప్రపంచ నైపుణ్యాల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆన్‌లైన్‌లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. యూత్ స్కిల్స్ డే కేవలం నైపుణ్యాలకే కాకుండా యువతకు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, ప్రోత్సాహాన్ని అందించి, సమాజం, దేశాభివృద్ధిలో వారి పాత్రను బలపర్చడం కోసం యూత్ స్కిల్స్ డే ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ బీహెచ్‌వీఎన్ లక్ష్మి, కోఆర్డినేటర్ పి.భువనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డీవీఎస్ భారతి, జి.ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ తనిఖీ

దెందులూరు: పెదవేగి మండలంలో పోలీస్ పికెట్‌ను మంగళవారం నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య తనిఖీ చేశారు. కొప్పాక, విజయరాయి, కవ్వగుంటలోని పోలీస్ పికెట్‌ను పెదవేగి సీఐ కె.శ్రీనివాస కుమార్, ఎస్సై ఈ.రాజేంద్రప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. శాంతిభద్రతలు, ఇతర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిఘా సిబ్బంది అప్రమత్తం ఉండాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలుకు కృషిచేయాలి



ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలుపై విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, చిత్రంలో ఎమ్మెల్యేలు పులపర్తి, రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలులో రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలు, కేసుల పురోగతి, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. యానాదులు, ఎరుకల జీవనశైలి మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. వీరవాసరం ఎస్సీ కాలనీలో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, సూచనలు సలహాలు జిల్లా స్థాయి సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు మాట్లాడుతూ యానాదులు, ఎరుకలను జనజీవన స్రవంతిలో కలిసేలా మార్పు తీసుకొచ్చేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఊహాజనిత కేసులలో ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పుడు కేసులు, నకిలీ కులధ్రువీకరణ పత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదులో బాధితులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్య, రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, డీఎస్పీలు జి.శ్రీనివాసరావు, డి.యస్.ఆర్. యస్.యస్.మూర్తి, వి.నారాయణ స్వామి రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా వివిధ శాఖలు అధికారులు, డీవీఎంసీ సభ్యులు జె.సత్య సుధామ, పి.బాలకృష్ణ, ఎస్.త్రిమూర్తులు, టి.జగజీవన్ రావు, సి.హెచ్. మంగరాజు, టి.సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

ఏలూరు(మెట్రో): ఏలూరు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్య నియంత్రణ అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయు కాలుష్యం ఎక్కువ ఉన్న నగరాలలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో ఏలూరు ఉందని, ఈ చిన్న నగరంలో వాయు కాలుష్యంపై కారణాలు తెలుసుకుని, నియంత్రించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఏలూరు నగరంలో పెద్ద ఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని, వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో తడి, పొడి చెత్త విధానాన్ని నిబంధనల ప్రకారం చేయాలన్నారు. వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు

కలెక్టర్ జిల్లాలో పలు సమీక్షా సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు హాజరుకావడం లేదని ఇది సరైన పద్ధతి కాదని కలెక్టర్ చెప్పారు. కొంతమంది జిల్లా అధికారులు తాము సమావేశానికి హాజరు కాకుండా తమ కింది స్థాయి అధికారులను పంపిస్తున్నారన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, కన్సల్టెంట్ ఏ.కోమలి, సామజిక వన విభాగం జిల్లా అటవీ శాఖాధికారి ఎం.హిమశైలజ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌కు వెళ్లే మహిళల కోసం వర్క్‌షాప్

భీమవరం(ప్రకాశం చౌక్): గల్ఫ్‌కు వెళ్లే మహిళలు మోసపోకూడదనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఏపీ లిమిటెడ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమై గల్ఫ్ సురక్షిత వలసలపై సమీక్షించారు. జిల్లాలో ఉపాధి మార్గాలు మెండుగా ఉన్నాయని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబసభ్యులకు దూరమై సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు జిల్లాలో ఉపాధి మార్గాలపై ఆలోచన చేయాలన్నారు. జిల్లాలో ‘గల్ఫ్ వర్కర్స్ సహాయ కేంద్రం’ ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనికోసం డీఆర్‌డీఏ, పోలీస్, ఐసీడీఎస్, కార్మిక శాఖ సిబ్బందితో టీం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 6న గుర్తింపు పొందిన, పొందని ఏజెన్సీలతో వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. గల్ఫ్‌కు వెళ్లే మహిళలను గుర్తించి, వర్క్‌షాప్‌లో వారికి పూర్తి అవగాహన కలిగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వారికి వంట, భాష, బేబీ కేరింగ్, హౌస్ కీపింగ్ తదితర అంశాలపై పూర్తి శిక్షణను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఐఎల్‌ఓ ప్రతినిధి నెహ్వా అద్వానీ, ఇంటర్నేషనల్ నాన్ రెసిడెంట్స్ తెలుగు ఆర్గనైజేషన్ సీఈవో హేమ గల్ఫ్‌కు వెళ్లే మహిళా వర్కర్ల భద్రత, సురక్షిత ప్రయాణంపై సూచనలు, సలహాలను జిల్లా అధికారులకు వివరించారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. కౌశల్ వికాస్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషనర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. ఈ నెల 20 వరకూ గడువు ఉందని, 94934 82414 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

మేధస్సుకు పదును

- విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంచేలా ‘విజ్ఞాన్ మంథన్’
- ఏటా ప్రతిభాన్వేషణ్ పరీక్షలు
- జాతీయ స్థాయి విజేతకు రూ.25 వేల నగదు బహుమతి
- ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశలోనే మేధస్సుకు పదును పెడితే వారిలో జిజ్ఞాసను పెంచి వారి ఉజ్వల భవితకు బాటలు వేయొచ్చు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా, పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్సీఈఆర్టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు (స్టేట్ బోర్డు, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ) ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

6 నుంచి 11వ తరగతి వరకు

ఈ పోటీ పరీక్షను 6 నుంచి 11వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతుల విద్యార్థులను జూనియర్ విభాగంగా, 9–11 తరగతుల విద్యార్థులను సీనియర్ విభాగంగా వేరు చేసి పరీక్ష పెడతారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. తొలుత పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. పాఠశాల స్థాయిలో వచ్చే అక్టోబర్ 23, 27 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఒక విద్యార్థి ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వొచ్చు. ఈ పరీక్షల ద్వారా మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన మొత్తం 18 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, 2 వేల నగదుతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి జ్ఞాపికతో పాటు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

మొత్తం 100 ప్రశ్నలు

విద్యార్థులు అప్పటి వరకూ తాము చదివిన, తమకు పరిచయం ఉన్న సబ్జెక్టుల నుంచే ప్రశ్నలుంటాయి. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో 100 ప్రశ్నలుంటాయి. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి అనే అంశానికి సంబంధించి 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో జూనియర్, సీనియర్ విద్యార్థుల గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్, రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలుంటాయి. మాక్ పరీక్ష వచ్చే అక్టోబర్ 10న నిర్వహించనున్నారు.

జాతీయ స్థాయి విజేతకు రూ. 25 వేల బహుమతి

జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023– 24 జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1 నుంచి 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో పాటు భాస్కర స్కాలర్‌షిప్ ప్రోగ్రాం కింద ఏడాది పాటు నెలకు రూ.2 వేలు ఉపకార వేతనంగా అందచేస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. సెప్టెంబర్ 15 లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకోవడానికి వీవీఎం పరీక్ష మంచి అవకాశం. విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రవేత్తలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహిస్తున్న పరీక్షల్లో ఇదొకటి. మన జిల్లా నుంచి గత ఏడాది నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

స్వర్ణ వెంకటేశ్వరరావు, కౌశల్ జిల్లా కో–ఆర్డినేటర్

టీచర్లు ప్రోత్సహించాలి



విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికి తీయడానికి 2014లో ఈ పరీక్ష ప్రారంభించాం. ఈ పరీక్షలకు ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకునేలా అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– ద్రొవ్విడి రాజ్‌కుమార్, విజ్ఞాన భారతి సంస్థ జిల్లా ప్రథమ అధ్యక్షుడు

క్లుప్తంగా

గోపినాథపట్నంలో చోరీ



షాపులో సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎస్సై మణికుమార్

ఉంగుటూరు: గోపినాథపట్నం శివారులో ఉన్న ఒక షాపులో నిర్వహిస్తున్న ఫ్లిప్ కార్ట్ హబ్‌లో ఆదివారం రాత్రి జరిగిన దొంగతనంపై చేబ్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని ఇద్దరు యువకులు ముసుగులు ధరించి షాపులో రూ.3.45 లక్షల నగదు అపహరించారని, సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలల జైలు

నూజివీడు : చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో ఓ నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పట్టణంలోని స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన వ్యాపారి రాసాబత్తుల వెంకటరావు జులై 2016లో నిందితుడు యడ్ల వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంత కాలం తరువాత తన బాకీ తీర్చమని వెంకటరావు అడగగా రూ.1.50 లక్షలకు ఒక చెక్కు, రూ.50 వేలు చొప్పున మూడు చెక్కులు వెంకటేశ్వరరావు ఇచ్చాడు. దీంతో ఆ చెక్కులను వెంకటరావు బ్యాంకులో వేయగా, ఖాతాలో నగదు లేదని అవి తిరిగొచ్చాయి. దీంతో బాధితుడు స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం నిందితుడు వెంకటేశ్వరరావుకు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు.

కాలువలో దూకి మహిళ ఆత్మహత్య

దెందులూరు: పోలవరం కాలువలోకి దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాక వద్ద పోలవరం కుడికాలువలో మంగళవారం ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈమెను లింగపాలెం మండలం మఠంగూడెంకు చెందిన గద్దే శ్రీదేవిగా నిర్ధారించారు. సోమవారం జానంపేట వద్ద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పంచానామా నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదవేగి ఎస్సై ఈ.రాజేంద్రప్రసాద్ చెప్పారు.

ఉద్యాన కోర్సులకు క్రేజ్

- బీఎస్సీ ఆనర్స్‌లో చేరికలకు ఆగస్టు 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహణ తేదీలు త్వరలో వెల్లడి
- వర్సిటీ 4 కళాశాలల్లో 300 సీట్లు 4 ప్రైవేట్ కళాశాలల్లో 240 సీట్లు
- ఐసీఏఆర్ కోటా, హార్టి సెట్ కోటాలో అందుబాటులో మరో 75



వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల

తాడేపల్లిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వెంకట్రామన్నగూడెంలో 17 ఏళ్ల క్రితం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటుతో ఉద్యాన విద్యకు ఊతం వచ్చింది. దేశంలోనే రెండో ఉద్యాన వర్సిటీగా దివంగత సీఎం వైఎస్ హయాంలో ఏర్పాటు కావడం, రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధనాశాలలు ఉండటం, కొత్త వంగడాలపై విస్తృత పరిశోధనలు వర్సిటీకి గుర్తింపును తీసుకువచ్చాయి. ఉద్యాన వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలతో పాటు ఐసీఏఆర్ గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలల రాకతో ఉద్యాన విద్య విద్యార్థులకు చేరువైంది. వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్‌లో చేరడానికి గాను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల తొమ్మిదిన మొదలైంది. ఆగస్టు తొమ్మిదో తేదీ చివరితేదీ. ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ తేదీలను తర్వాత వెల్లడిస్తారు.

వర్సిటీ పరిధి ఆధారంగా సీట్ల భర్తీ

ఈఏపీసెట్‌లో ర్యాంకుల ఆధారంగా ఉద్యాన వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో సీట్లను భర్తీ చేస్తారు. ఆంధ్రా యూనివర్సిటీ–శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు.. కాలేజ్ ఆఫ్ హార్టీకల్చర్, వెంకట్రామన్నగూడెం, పార్వతీపురం, చిన్నలటరపి (ప్రకాశం జిల్లా) కళాశాలల్లో విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ పరిధి కిందకు వస్తారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలు.. కాలేజ్ ఆఫ్ హార్టీకల్చర్, అనంతరాజుపేట విద్యార్థులు ఈ కళాశాల పరిధి కిందకు వస్తారు.

4 కళాశాలల్లో 300 సీట్లు

రాష్ట్రంలో ఉన్న నాలుగు ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ ఆనర్సులో 300 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో 130, పార్వతీపురం కళాశాలలో 50, చినలటరపి కళాశాలలో 50, అనంతరాజుపేట కళాశాలలో 70 సీట్లు ఉన్నాయి. పేమెంట్ సీట్ల కింద 13 సీట్లను కేటాయించారు. ఈఏపీసెట్‌లో మెరిట్ ఆధారంగా భర్తీ అయిన 300 సీట్లు పోను తర్వాత ర్యాంకులు పొందిన మరో 13 మంది విద్యార్థులకు పేమెంట్ కోటా కింద సీట్లు భర్తీ చేస్తారు.

ఐసీఏఆర్ సీట్లు 30

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కోటా కింద ఏఐఈఈఏ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులలో 30 మందికి రాష్ట్రంలోని వెంకట్రామన్నగూడెం, అనంతరాజుపేటల్లో ఐసీఏఆర్ కోటా సీట్లు 30 ఉన్నాయి.

హార్టీసెట్ ద్వారా 45

పదో తరగతి తర్వాత హార్టీ డిప్లమో చేసిన విద్యార్థులకు హార్టీసెట్ ద్వారా పరీక్ష నిర్వహించి మెరిట్ విద్యార్థులు బీఎస్సీ ఆనర్సు చేయడానికి వీలుగా 45 సీట్లు కేటాయించారు. మొత్తంగా అన్ని రకాల కోటాలు కలుపుకుంటే బీఎస్సీ ఆనర్స్ కోర్సులో ఉద్యాన వర్సిటీ కళాశాలల్లో చేరడానికి 388 సీట్లు ఉన్నాయి. అలాగే ఎంఎస్సీ హార్టీకల్చర్‌లో 48 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ ఆనర్సు నాలుగు సంవత్సరాలు, ఎంఎస్సీ హార్టీ కోర్సు రెండేళ్లు చదవాలి. తర్వాత పీహెచ్‌డీ చేసే అవకాశాలు ఉన్నాయి.

గుర్తింపు పొందిన కళాశాలల్లో 240 సీట్లు

ఉద్యాన వర్సిటీ గుర్తింపు పొందిన నాలుగు ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టీ కల్చర్, జేసీ దివాకరరెడ్డి కాలేజ్ ఆఫ్ హార్టీ కల్చర్, ప్రకాశం జిల్లాలో కదిరి బాబూరావు కాలేజ్ ఆఫ్ హార్టీకల్చర్, ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టీకల్చరల్ కళాశాలల్లో ఒక్కొక్క కళాశాలలో 60 సీట్లు చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఎన్ఆర్ఐ సీట్ల భర్తీ ఇలా..

ఎన్ఆర్ఐ కోటాగా కేటాయించిన 15 శాతం సీట్లకు ఏడాదికి 3,500 డాలర్ల ఫీజు చెల్లించాలి. ఇంటర్ బైపీసీలో 50 శాతం మార్కులు వచ్చిన వారు ఈ సీటు పొందడానికి అర్హులు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఈ సీటు పొందిన వారికి వర్తించదు.

సూపర్ న్యూమరరీ కోటాలో 11 సీట్లు

ఈ విద్యాసంవత్సరంలో ఉద్యాన వర్సిటీలో ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద వచ్చిన 45 సీట్లతో పాటు సూపర్ న్యూమరరీ కోటా కింద అదనంగా 11 సీట్లు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో వీటిని మార్గదర్శకాల ప్రకారం భర్తీ చేస్తారు.

ఇండస్ట్రీ కోటా

ఇండస్ట్రీ కోటా కింద కూడా ఈ సంవత్సరంలో 8 సీట్లు వర్సిటీకి కేటాయించారు. పారిశ్రామికవేత్తల ద్వారా స్పాన్సర్ చేయించుకుని నిబంధనల ప్రకారం ఈ సీట్లు పొందవచ్చు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



విద్యార్థి దేవీ ప్రసాద్ మృతదేహం

పోలవరం రూరల్ : పోలవరం పంచాయతీ పరిధిలో పాత పోలవరంలో కడెమ్మ స్లూయిజ్ వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత పోలవరం గ్రామానికి చెందిన కొవ్విడి దేవీప్రసాద్ (12) 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం తోటి విద్యార్థులతో కలిసి కడెమ్మ స్లూయిజ్ ప్రాంతంలో ఆడుకునేందుకు వెళ్లాడు. విద్యార్థులు ఆడుకుంటుండగా, గట్టు దిగువకు వెళ్లిన దేవీప్రసాద్ జారిపోతుండగా, అప్పటికే అక్కడ తెగిపడి ఉన్న 11 కేవీ విద్యుత్‌వైర్లను పట్టుకోవడంతో షాక్ తగిలింది. గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని గ్రామస్తులు, కుటుంబసభ్యులకు తెలియజేయడంతో పరిగెత్తుకుని వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న ప్రసాద్‌ను పోలవరం వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. పాఠశాలకు రెండురోజులు సెలవులు రావడంతో ఆడుకోవడానికి వెళ్లిన ప్రసాద్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ట్రాన్స్‌కో ఏఈ కె.సత్యనారాయణ, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అప్పటికే తెగిపడిన విద్యుత్ వైర్లను పరిశీలించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి వైద్యశాలలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తమ్మిలేరుకు భారీగా వరద నీరు

- 335.28 అడుగులకు చేరుకున్న జలాశయ నీటిమట్టం
- ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 355 అడుగులు



మండలంలో తమ్మిలేరుకు ప్రవహిస్తున్న వరద నీరు

చింతలపూడి: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. తమ్మిలేరుకు ఎగువ ప్రాంతమైన తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఏలూరు జిల్లాలో పడుతున్న వర్షాలకు తమ్మిలేరుకు వరద నీరు వచ్చి చేరింది. తమ్మిలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 335.28 అడుగులకు నీరు చేరినట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం మంగళవారం చెప్పారు. శుక్రవారం ఉదయానికి ఆంధ్రా కాలువ ద్వారా మరింత వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది తమ్మిలేరు ప్రాజెక్టు కింద ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల్లో కలిపి 9,169 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు ఎడమ కాలువ కింద ఏలూరు జిల్లాలో 4,244 ఎకరాలు, కుడి కాలువ కింద ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల్లో 4,925 ఎకరాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా, 348 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే అధికారులు కాలువల ద్వారా సాగునీరు విడుదల చేస్తారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.684 టీఎంసీలు ఉందని తమ్మిలేరు జలాశయం ఏఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిగా నీటితో నిండితే పంటలకు సాగునీటి కొరత ఉండదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చునని అధికారులు చెప్పారు.

బాలికల చదువుకు 'బోఫ్' ద్వారా చేయూత



వార్షికోత్సవ ప్రారంభ సభలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : బాలికలు, మహిళల కోసం 56 ప్రత్యేక విద్యాలయాలు స్థాపించి 175 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 175వ వార్షికోత్సవాన్ని ఏడాదిపాటు నిర్వహిస్తామని బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు చెప్పారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బోఫ్) ఆధ్వర్యంలో వార్షికోత్సవ ప్రారంభ సభను పవరుపేటలో మంగళవారం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా చేపట్టే వివిధ కార్యక్రమాలను వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం విశ్రాంత తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు, మహిళలను విద్యావంతుల్ని చేయాలనే లక్ష్యంతో వారికోసం మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే 1848 నుంచి 1850 వరకు పూణేలో 56 విద్యాలయాలు స్థాపించారన్నారు. మానవతా సంస్థ జిల్లా నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజం నుంచి సహకారం లేక నేటికీ బాలికల్లో అక్షరాస్యత 60 శాతం దాటలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలోత్సవ కమిటీ నిర్వాహకులు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సంవత్సరం పాటు నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమాల ద్వారా నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను, పిల్లలను చదివించేలా సమాజం ప్రోత్సహించాలన్నారు. నిరాదరణకు లోనై మధ్యలో చదువులు నిలిపివేసిన బాలికలకు చదువు కొనసాగించేలా విద్యా సహకారం అందిస్తామని బోఫ్ నాయకులు మేతర అజయ్ బాబు తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన బాలికల సమాచారాన్ని బోఫ్ వాట్సాప్ నంబర్ 77805 73531కు తెలియజేస్తే ఆ బాలికల చదువు కొనసాగించేందుకు చేయూతనిస్తామని ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లబోతు శ్రీనివాసరావు చెప్పారు. 'ప్రతి విద్యార్థి ఇంట భారత రాజ్యాంగం' అనే ద్విభాషా పుస్తకాన్ని సభలో న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ప్రారంభోత్సవ సభలో నాయకులు శిరీష, రమేష్ నాయక్, గోరింక అనిల్ కుమార్, కస్తూరిరావు, కుమార్‌రాజు, రోహిత్, యలుబూడి సత్యభారతి, దుర్గాప్రసాద్, అలగా జయరాజు, పుల్లాబొట్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



మృతుడు ఏలూరు వెంకన్న

ఆకివీడు: ఆకివీడులో వెల్డింగ్ పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సంతపేటకు చెందిన ఏలూరు వెంకన్న (39) కొత్త బస్‌స్టాండ్ వద్ద ఉన్న ఐరన్ షాపులో వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. మంగళవారం యథావిధిగా పనికి వెళ్లిన వెంకన్న వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారించారు. మృతుడి భార్య కిరణ్ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ముదినేపల్లి రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ వ్యక్తికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. ఎస్సై డి వెంకటకుమార్ తెలిపిన వివరాల ప్రకారం 2018వ సంవత్సరంలో మండలంలోని ఓ గ్రామంలో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో వినుకొండ సునీల్‌కుమార్ అనే వ్యక్తి బిస్కెట్లు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి కేకలు వేయగా సునీల్‌కుమార్ పారిపోయాడు. దీనిపై అప్పటి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి సునీల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఏలూరు కోర్టులో ఈ కేసులో విచారణ జరగ్గా నిందితుడు సునీల్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసు విచారణకు సహకరించిన కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై డి.వెంకటకుమార్, ఏఎస్సై వీఎల్ దత్తును ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): 2024–25 విద్యాసంవత్సరానికి 9, 10వ తరగతి చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థులు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు, టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్ కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌నకు ఆన్‌లైన్‌లో ఈ ఏడాది ఆగస్టు 31లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బైట్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

భీమవరం/పాలకోడేరు: పాలకోడేరు మండలం పెన్నాడలోని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (బైట్) కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) లభించిందని కళాశాల చైర్మన్ అడబాల శ్రీవెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాల ఇప్పటివరకు కాకినాడ జేఎన్టీయూకే అనుబంధంగా ఉండేదని, ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఆటానమస్ సంస్థగా కొనసాగుతుందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు స్వయం ప్రతిపత్తి హోదా ఉపకరిస్తుందన్నారు. ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ మాట్లాడుతూ అటానమస్ హోదా పొందడం వల్ల తమ కళాశాలలో కొత్త కోర్సులు ఏర్పాటు ప్రోగ్రామ్‌లను రూపొందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. కళాశాల డైరెక్టర్స్ అడబాల సత్యసాయి రామతేజ, హర్ష తేజశ్రీ, అకాడమిక్ డీన్ కురెళ్ళ భాస్కరరావు పాల్గొన్నారు.

హృద్రోగ బాధితుడికి సకాలంలో ఇంజెక్షన్

- తప్పిన ప్రాణాపాయం.. కాకినాడ తరలింపు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో అందుబాటులోకి..



చికిత్సపొందుతున్న వాసా సుబ్రహ్మణ్యం

నరసాపురం : గత వైఎస్సార్ సీపీ హయాంలో నరసాపురంలో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రిలో వైద్యులు గుండెపోటుకు గురైన 66 ఏళ్ల వాసా సుబ్రహ్మణ్యం అనే వృద్ధుడికి చికిత్స అందించి అతడి ప్రాణాలు కాపాడారు. గతంలో గుండెపోటు లాంటి ప్రాణాంతక ఘటనలు ఎదురైతే పెద్ద ప్రైవేట్ ఆసుపత్రులకో, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు రోగులు పరుగులు తీసేవారు. సుబ్రహ్మణ్యం గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆసుపత్రికి తీసుకువెళ్లగానే అతనికి టెనెక్టెరల్ 40 ఎంజీ ఇంజెక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ పంపించారు. ఈ ఇంజెక్షన్ చేసేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.40 వేలు వసూలు చేస్తారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం నరసాపురంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచిన కారణంగానే వృద్ధుడి ప్రాణాలు నిలబడ్డాయని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సుప్రియ, డాక్టర్ హారిసన్‌లకు కూడా కృతజ్ఞతలు చెప్పారు.

ఆఖరి మజిలీలో అపశ్రుతి

- కొండేపూడి గ్రామంలో కాలువ ఆవలి గట్టున శ్మశానవాటిక
- మృతదేహాన్ని తరలించే యత్నంలో కాలువలో మునిగిన నాటు పడవ
- క్షేమంగా బయటపడిన బంధువులు, గ్రామస్తులు



కొండేపూడిలోని జీఅండ్‌వీ కెనాల్‌లో శవాన్ని తీసుకువెళుతుండగా పడవ మునిగిన దృశ్యం

పాలకోడేరు: మండలంలోని మైనర్ పంచాయతీ కొండేపూడిలో శ్మశాన వాటికకు ఓ వృద్ధుడి మృతదేహాన్ని కాలువ ఆవలి వైపు ఉన్న శ్మశానవాటికకు నాటు పడవపై తీసుకెళ్లే క్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పడవ మునిగిపోవడంతో పలువురు బంధువులు, గ్రామస్తులు కాలువలో పడిపోయారు. అయితే వారు క్షేమంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కొండేపూడి గ్రామంలో దశాబ్దాల తరబడి శ్మశాన వాటిక లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి మృతదేహాలను శ్మశానవాటికకు తరలించాలంటే జీఅండ్‌వీ కెనాల్ దాటి వెళ్లాలి లేదా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంతెన మీదుగా కాలువ ఆవలి గట్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఎవరైనా చనిపోయిన సందర్భంలో శ్మశానానికి శవాన్ని తీసుకువెళ్లేందుకు జీవీ కెనాల్ వద్ద ఒక నాటు పడవను గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామంలో ఒక వృద్ధుడి శవాన్ని తీసుకువెళ్తుండగా పడవ మునిగిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. గతంలో అనేక సందర్భాల్లో పడవ బోల్తా కొట్టడం, మునిగిపోవడం జరిగింది. దీంతో అంత్యక్రియలు వెళ్లే బంధువులు ఒక్కొక్కసారి ప్రమాదాల బారిన పడుతున్నా సమస్యను పరిష్కరించే నాథుడు కరువయ్యాడు.

తోకలపూడిలో గేదెపై లైంగిక దాడి



పశువుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి ప్రియాంక

వీరవాసరం: తోకలపూడిలో గంజాయి, మద్యం మత్తులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గేదెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తోకలపూడికి చెందిన పిల్లి సీతారామయ్య పశుపోషణ చేస్తున్నాడు. ఈ నెల 3న రాత్రి తన పశువుల పాకలో గేదెను కట్టి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున గేదెను బయటకు తీసుకురావడానికి వెళ్లగా లేవలేని స్థితిలో అది పడి ఉంది. స్థానిక పశు వైద్యునికి తెలపడంతో పశువుకు వైద్య పరీక్షల అనంతరం గేదె నడుమును, కాళ్లను తాళ్లతో బంధించి పలువురు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో సీతారామయ్య ఈ ఘటనపై వీరవాసరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్పందించలేదు. రైతు సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో వెళ్లి స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఎస్సై పి.రమేష్, మండల పశు వైద్యాధికారి ప్రియాంక ఘటనాస్థలిని సందర్శించి గేదెకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. స్థానికంగా ఉండే గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి, మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని రైతు వాపోయారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: వివాహిత అదృశ్యంపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఇరగవరం మండలం అర్జునుడుపాలెం గ్రామానికి చెందిన మాంద్రు శ్రీనుకు, మణి కుమార్తెకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఏడాది క్రితం అల్లుడు కువైట్ వెళుతూ భార్య, పిల్లలను పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలోని అత్తగారింటి వద్ద ఉంచాడు. అయితే ఈనెల 12వ తేదీ తెల్లవారుజామున తన కుమార్తె ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో తల్లి రాజామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు మంగళవారం చెప్పారు.

క్లుప్తంగా

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నీలాద్రిపురం గ్రామంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వద్ది రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్ : గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆక్వా డవలప్‌మెంట్ అథారిటీ మాజీ వైస్‌చైర్మన్ వద్ది రఘురామ్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను స్వయంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పార్టీ స్థితిగతులను స్థానిక నాయకులు వివరించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయనవెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఆరుళ్ల గ్రామ సర్పంచ్ మాకరాజు సతీష్, సేవాదళ్ మండల చైర్మన్ కొండుబోయిన కృపావరం తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నారపురెడ్డి సూర్యనారాయణ అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డవలప్‌మెంట్ అథారిటీ మాజీ వైస్‌చైర్మన్ వద్ది రఘురామ్‌నాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాపాక వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పొగాకు వినియోగాన్ని నిషేధించాలి

ఆకివీడు: పొగాకు తినడం, నమలడం, తాగడం అనారోగ్యమని, తీవ్ర రుగ్మతలకు లోనవుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగాన్ని నిషేధించండి, ఉప ఉత్పత్తుల్ని రద్దు చేయండి అని నినాదాలు చేశారు. పాఠశాల హెచ్‌ఎం విక్రమ్ మాట్లాడుతూ గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, జర్దా, సిగరెట్‌లు, చుట్టల వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు.

విద్యా, క్రీడారంగాల్లో మేటిగా గురుకులం



పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాల



గురుకుల విద్యాలయంలో ఎల్‌ఈడీ ప్యానల్స్‌పై విద్యాబోధన చేస్తున్న దృశ్యం

- విద్యలో నూటికి నూరు శాతం ఫలితాలు
- బ్యాగ్ ఫైపర్ బ్యాండ్‌లో ద్వితీయం
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం



స్కాట్లాండ్ బ్యాగ్ పైపర్ బ్యాండ్ టీమ్

తాడేపల్లిగూడెం రూరల్: విద్య, క్రీడా రంగాల్లో మేటిగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు నిలుస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించడం విశేషం. విద్య, ఇతర క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ఇక్కడి విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని చూసి తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు ప్రిన్సిపల్ బి.రాజారావు సహకారం తోడు కావడంతో విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. విద్యార్థి దశలోనే ల్యాబ్ ట్యాప్‌పై అప్లికేషన్ల రూపకల్పన, ప్రోగ్రామింగ్ వంటి వాటిలోనూ, వివిధ భాషలకు చెందిన పదాలను అనర్గళంగా చదివి వినిపించడం ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు తార్కాణం. ఈ విభాగంలోనూ విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. స్కాట్లాండ్ బ్యాగ్ పైపర్ బ్యాండ్‌లో 2024 జనవరిలో ఢిల్లీలో జరిగిన పోటీల్లో పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటాలను 500మంది విద్యార్థులు గీయడంతో పాటు ఉపాధ్యాయ పాత్రలో విద్యార్థులు విద్యాబోధన చేస్తూ 500 వీడియోలను యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. అంతే కాకుండా స్వీయ రక్షణ విభాగమైన తైక్వాండో పోటీలకు ఇక్కడి విద్యార్థులు దుబాయ్ వెళ్లి ప్రతిభకనబర్చిన సందర్భాలు ఉన్నాయి. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ఇక్కడి విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది.

నూరు శాతం ఫలితాలు

విద్యలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని గురుకుల విద్యాలయాలకు స్ఫూర్తిగా పెదతాడేపల్లి గురుకులం నిలుస్తోంది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఫలితాలను ఇక్కడి విద్యార్థులు సాధించారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఈ స్కూలునుంచి అత్యధిక మార్కులుగా 557 మార్కులు సాధించారు. ఇదే విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రవేశాలకు 40 మంది విద్యార్థులు అర్హత సాధించగా, ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం ఇక్కడి విద్యా విధానానికి నిదర్శనంగా నిలుస్తోంది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించాలనే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా నిర్వహించే శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలోనూ ఈ పాఠశాలనుంచి 139మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకావడం విశేషం. మొదటి దశ కౌన్సెలింగ్‌లో 15మంది విద్యార్థులు కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు సాధించారు. పేదింట పుట్టిన విద్యార్థులు ఇంతటి ఘనతను సాధించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

కుటుంబ నియంత్రణతో సమాజానికి మేలు



పెంటపాడు పీహెచ్‌సీలో మహిళలకు వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ మౌనిక, సిబ్బంది

పెంటపాడు: కుటుంబ నియంత్రణతో సమాజానికి మేలు జరుగుతుందని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు తోట రాజేష్, వి. మౌనికలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరుగురి మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు మూడు దశల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణపై శ్రద్ధ వహించి, అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో డి. సుజాత, స్టాఫ్ నర్సు హేమ, ఏఎన్‌ఎం ఈశ్వరి, హెచ్. సత్యనారాయణ, మారిశెట్టి తేజోనాథ్, మీసాల సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

31న మండల పరిషత్ సమావేశం

పెంటపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 31న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులతో పాటు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి



జగన్నాథపురం సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన బకాయిలకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఆరు నుంచి ఏడు వారాలుగా పెండింగ్ బకాయిలు ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలి సొమ్ములు బకాయి ఉంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించని పక్షంలో మండల, జిల్లా స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటి సభ్యులు గాదినాయుడు, తోట సత్యనారాయణ, గుణ్ణం వెంకటేశ్వరరావు, పిల్లా కోటేశ్వరరావు, మొండి రమణ, వెంకటాపు కనకారావు, కూనవరపు నాగభూషణం, ఈదర సత్యనారాయణ, సైదు సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

18న అలంపురానికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: ఈ నెల 18న అలంపురం వెంకటరమణ ఛారిటీ ఉచిత ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఈఎన్‌టీకి సంబంధించిన ప్రత్యేక వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. దీంతో పాటు, గుండెకు సంబంధించి ఈసీజీ, 2డి ఈకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్, పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మిరప సాగు

తాడేపల్లిగూడెం: మిరపసాగుకు సమాయత్తం తొలకరిలో యాజమాన్య పద్ధతులపై డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం, రైతుల సలహా కేంద్రం సంయుక్త సమన్వయంతో మంగళవారం వెబినార్ జరిగింది. 2023–24 సంవత్సరాన్ని ఉద్యానవర్సిటీ ఇయర్ ఆఫ్ మిరపగా ప్రకటించిన నేపథ్యాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. మిరపలో మేలైన యాజమాన్య పద్ధతులు, మిరప నారుమళ్లను ఆశించే తెగుళ్ల, నివారణ పద్ధతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన సంచాలకులు ఎల్.నారం నాయుడు , విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ ,లాం శాస్త్రవేత్తలు సి.వెంకటరమణ, టి.విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఆకివీడు: మద్యం అక్రమ అమ్మకాల్లో పట్టుపడ్డ మూడు వాహనాల్ని స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఈ వాహనాల వేలం ద్వారా రూ.61,420 ఆదాయం వచ్చినట్లు స్థానిక సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని చెప్పారు. జిల్లా ఏఈఎస్ ఆర్సీహెచ్. చిట్టిబాబు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా ఎస్సై జే యుగంధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో బోధనపై ప్రభావం



భీమవరంలో డీఈవో నాగమణికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటు వెంటనే పూర్తి చేయాలని డీఈవో జి.నాగమణికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాబాజీ సాహెబ్, రమణ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో అనేక పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల సర్దుబాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలకు నిధులు సకాలంలో విడుదలకాక పాఠశాలల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారమవుతోందని, త్వరగా స్కూల్ మెయింటినెన్స్ నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ నాగమణి త్వరలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఎన్‌పీ సుభాషిణి, వేమూరి శ్రీవల్లి, పెద్దాడ రాజేశ్వరరావు, పి నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో కొత్త ఇళ్లు నిర్మించుకున్న నలుగురు లబ్ధిదారులకు వేగేశ్న నర్సింహరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీ వెంకటరాయవర్మ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో ఎవరు ఇల్లు నిర్మించుకున్నా వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం ట్రస్ట్ తరపున అందజేస్తుంటారు. ఈ క్రమంలో గృహాలు నిర్మించుకున్న నలుగురికి కోటమటిగుంట గ్రామ సర్పంచ్ భవనం భాగ్యశ్రీ శివకుమార్, కోలనపల్లి ఎంపీటీసీ వేగేశ్న సత్యనారాయణరాజు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.

రోడ్డుపై భారీ గోతుల వద్ద నిరసన

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?



కరుకువాడ బేతపూడిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: మండలంలో వెంప–బేతపూడి రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా తయారైందని వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవతున్నా ఆర్అండ్‌బీ అధికారులకు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని కరుకువాడ బేతపూడి మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టడం లేదని ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో భారీ గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివారం వెంప గ్రామానికి చెందిన ఇంటి ప్రకాష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మరణించినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుపై గోతులను పూడ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెదపాటి జయనందరావు వేగి మోహన్‌రావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాళ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యుడు సరాబు సునీల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం డెంగీ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కొబ్బరిబొండాలు, వాడేసిన టైర్లు, ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదముందని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే పీహెచ్‌సీని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద క్షయ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎస్ బీ సుజనా, ఎస్టీఎల్ఎస్ కే చంద్ర దొరరెడ్డి వైద్య సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ డీ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

భీమవరం: జరిమానా తప్పించుకోవడానికో, పోలీసుల కోసమో కాదు, భద్రత, భవిష్యత్తు కోసం వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ఆర్ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో శ్రీవిజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి – సురక్షితంగా ప్రయాణించండంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని తద్వారా ప్రమాదాల కొని తెచ్చుకోవద్దన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి ఏటా వందల మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రక్షణ కవచంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రసూన పాల్గొన్నారు.

పాతూరు శివారులో కలుషిత నీరు



పాతూరు శివారు 12వ వార్డులో మురుగు డ్రెయిన్‌లో కుళాయి పైపులైన్‌లు



మున్సిపల్ కుళాయిలో వచ్చిన బురద నీరు

- విజృంభిస్తున్న వ్యాధులు
- ఆందోళనలో స్థానికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యా, వాణిజ్యం, రవాణా రంగాల్లో పేరుగాంచిన తాడేపల్లిగూడెం పట్టణం సమస్యలకు నిలయంగా మారుతోంది. ప్రధానంగా మురుగునీటి పారుదల సమస్య వెంటాడుతోంది. ముఖ్యంగా వీధుల్లో అపారిశుద్ధ్యంతో చెత్త పేరుకుపోతోంది. పాతూరు 12వ వార్డు శివారు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్)కు ఎదురుగా ఉన్న పరిసర ప్రాంతాల్లో కుళాయి నీటిలో కొంత కాలంగా తోకపురుగులు, కొంతసేపు బురదనీరు, తరుచు దుర్వాసనతో కూడిన మురుగు నీరు రావడంతో పాటు వాంతులు, విరేచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సచివాలయ సెక్రటరీ తరుచూ పరిశీలనలు చేసినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. పాతూరు నుంచి కరకట్ట వైపు దారిలో కచ్చా డ్రెయిన్‌ను ప్రొక్లెయినర్‌తో తవ్వారు. ఆ మార్గంలో అనేక పైపులైన్‌లు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో పైపులైన్‌లు డ్యామేజ్ అయ్యాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చాలా వరకు పైపులైన్‌ల లీకేజీలను అరికట్టారు. పలుచోట్ల పైపులైన్‌లకు లీకేజీలు అలానే ఉన్నాయి. డ్రెయిన్లలో మురుగు నీరు ఎక్కడో ఒకచోట కలిసిపోయి, కుళాయి నుంచి పరిశుభ్రమైన నీరు రావడం లేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. స్థానికులు తాగునీటి కోసం వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించి, టిన్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కుళాయి కలుషిత నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్ మురళీకృష్ణను వివరణ కోరగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



పాతూరు 12వ వార్డు శివారు పరిసర ప్రాంతాల్లో కుళాయి నీటిలో కొంత కాలంగా తోక పురుగులు, తరుచూ దుర్వాసనతో కూడిన మురుగు నీరు వస్తుంది.ఎంతో కాలంగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలకు, పెద్దలకు టైఫాయిడ్, వాంతులు, విరేచనాలతో పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఎం.అనుసూయ, స్థానిక గృహిణి, పాతూరు